సంక్షేమాభివృద్ధే జగనన్న ధ్యేయం

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- 31వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని 31వవార్డు కౌన్సిలర్ సింధలూరి రజని ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. కులం, మతం, పార్టీ అని చూడకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేరుస్తూ.. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. వార్డు, గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి గాంధీజీ కలలు గన్న స్వరాజ్యస్థాపనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రభుత్వ పథకాల్లో వైఎస్సార్ చేయూత, రైతుభరోసా, సున్నావడ్డీ, ఆసరా, పింఛన్ కానుక, పంటలబీమా, అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు తదితర వాటిలో తమకు లబ్ధి కలిగిందంటూ ప్రజలు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఇలాంటి ప్రభుత్వాన్ని, నిత్యం ప్రజలకు మేలు చేయాలని ఆలోచించే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు తేడాలను గుర్తించి మంచి చేస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఎస్వీ.రమణ, భాను, సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి, కోఆప్షన్ శారదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మెట్రోబాబ్‌జాన్, గార్ల చంద్రమౌళి, సోమశేఖర్‌రెడ్డి, కృష్ణగోపాల్‌నాయక్, జాన్‌బాబు, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో 1,090 దుకాణాల గుర్తింపు

బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలో 1,090 వాణిజ్యపరమైన దుకాణాలు ఉన్నట్టు గుర్తించామని మేనేజర్ కే.ర మాదేవి చెప్పారు. శనివారం ఆమె మాట్లాడుతూ నగర పంచాయతీ ఏర్పడ్డాక వాణిజ్యపరమైన దుకాణాలను లెక్కించామని చెప్పారు. నగలు, వస్త్ర, ప్రొవిజనల్స్, చిల్లర దుకాణాలు, ఫ్యాన్సీ, టైలరింగ్, గుజిరి, హోటళ్లు, టీ షాపులు తదితర షాపుల్లో అధిక వ్యాపారం జరిగే 315 షాపులను గుర్తించామని చెప్పారు. వీటన్నింటికి ట్రేడ్‌లైసెన్సులు జారీ చేస్తున్నామని చెప్పారు. గుర్తించిన పెద్దషాపులకు 2022 ఏడాదికి సంబంధించి రూ.500 ఫీజు వసూలు చేస్తున్నామని చెప్పారు. కొత్త ఏర్పడిన నగర పంచాయతీ కావడంపై షాపులపై భారం మోపకుండా అతితక్కువ ఫీజును నిర్ణయించామని, ఇకపై ఏటా చిన్న షాపులకు రూ.300, పెద్దషాపులకు రూ.500 ఫీజు వసూలు చేయడం జరిగుతుందని చెప్పారు. యజమానులు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలని కోరారు.

మామిడి రైతులకు సలహాలు, సూచనలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి సుకుమార్ రెడ్డి

పీలేరు రూరల్ : మామిడి పూత దశలో ఉన్నప్పుడు సరైన మెలకవులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి సుకుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్దగాండ్లపల్లెలో మామిడి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మామిడి పూత ఆశాజనకంగా వచ్చిందన, దాన్ని కాపాడుకోవడానికి రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పూత దశలో తేనేమంచు పురుగు, పక్షికన్ను తెగులు నివారణకు థియోమెతొక్సిమ్ 0.3 గ్రాములు గానీ, ఇమిడా క్లోప్రిడ్ 0.5 మిల్లీ లీటర్లు గానీ హెక్సాకోనజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. పది సంవత్సరాలు పైబడిన చెట్లకు పిందె గోలికాయ నుంచి నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు చెట్టుకు ఒక కేజీ యూరియా, 3/4 కేజీ పోటాష్ వేసి నీరు కట్టాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటరమణ, వీహెచ్ఏ తిరుమల పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వం చేయూత



చాపల మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు : మత్స్యకారులకు ప్రభుత్వం చేయూతనిస్తోందని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, మత్స్యశాఖ అధికారి మోహనకృష్ణ అన్నారు. శనివారం స్థానిక వారపు సంత వద్ద మత్స్యకారుల వ్యాపార నిమిత్తం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాపల వ్యాపారం రోడ్డుపై నిర్వహించకుండా ఒక్క చోట అందరికీ అనువుగా ఉండేటట్లు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ఒక్కో దుకాణానికి రూ. 1.15 లక్షలు మంజూరు చేస్తోందని, అందులో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చలపతి, ఎంపీటీసీ షేక్‌షావలి, శ్రీరామ్‌సుధాకర్, సచిన్, భారేషా, భాస్కర్‌రెడ్డి, చక్రధర్, మత్స్య శాఖ అధికారి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా అన్నాభిషేకం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో శనివారం వైభవంగా లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం నిర్వహించారు. షిరిడిసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు లింగోద్భవ మహాశివుడికి శాస్త్రోక్తంగా జలాభిషేకం, పాలాభిషేకం, గంధాభిషేకం నిర్వహించారు.

ఘనంగా ఖాదర్‌వలి దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ : స్థానిక జామియా మసీదువద్ద నున్న ఖాదర్‌వల్లి దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉరుసు పురస్కరించుకుని దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పెనుగొండ దర్గా వారసులు కెపిఎస్‌బీ సాహజద్ బాబా హుస్సేని ప్రత్యేక అతిథిగా హాజరై ప్రార్థనలు చేశారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తంబళ్లపల్లి : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అర్చకులు కృష్ణప్రసాద్, రాఘవేంద్రస్వామి, రమేష్‌బాబు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు 11 రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ హాల్ టిక్కెట్లు

మదనపల్లె సిటీ : ఎన్ఎంఎంఎస్ హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీన పరీక్ష నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్‌లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా వెసులుబాటు కల్పించారని తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు యూడైస్ కోడ్ లాగిన్‌తో హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

వైఎస్సార్ బీమా అందజేత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కమ్మచెరువుకు చెందిన అగ్రహారం శ్రీనివాసులు (40) గుండెపోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్ చెరువు నరసమ్మ, కార్యదర్శి మంజునాథ్‌లు వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయంగా మృతుడి భార్య హేమలతకు రూ.10 వేల నగదును అందజేసారు. సహజ మరణం కింద బాధిత కుటుంబీకులకు మంజూరయ్యే మిగిలిన బీమా సొమ్ము బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

ఈ నెల 24న జాబ్‌మేళా

పీలేరు : స్థానిక మదనపల్లె మార్గంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఐసోన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాలు లోపు వయస్సు ఉండి పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 8897776368, 7799587687 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జగనన్న పాలవెల్లువపై గ్రామసభలు

పెద్దమండ్యం : జగనన్న పాలవెల్లువపై అధికారులు పాడి రైతులతో శనివారం గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని మందలవారిపల్లె, దేనేనాయక్‌తండా, వెలిగల్లు పంచాయతీలోని గురికివాండ్లపల్లె, కుడుములవారిపల్లె, సీ గొల్లపల్లె పంచాయతీలోని బండెపురెడ్డిగారిపల్లె, కుడుములవారిపల్లెల్లో అధికారులు జగనన్న పాలవెల్లువపై వివరించారు. ఎంపిక చేసిన పల్లెల్లో పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. పాడి రైతులకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, వెటర్నరీ డాక్టర్ విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్, ఏపిఎం మధుబాబు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కలకడ : బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని తిరుపతి యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాంప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక యూనియన్ బ్యాంక్ శాఖను తనిఖీ చేశారు. బ్యాంకును నూతన భవనంలోకి బదిలీ చేస్తున్న తరుణంలో నూతన కార్యలయలంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులపై ఆరా తీశారు. రైతులను, మహిళలను గౌరవించాలరు. మహిళా రుణాలు విరివిగా ఇవ్వడం వలన లావాదేవీలు పెరుగుతాయని, నెలవారి చెల్లింపులు ఉంటాయని గుర్తు చేశారు.

రామాలయ పునఃనిర్మాణానికి చర్యలు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లెలో టీఎన్ కుటుంబ పూర్వికులు నిర్మించిన పురాతణ కోదండ రామాలయాన్ని పునః నిర్మించడానికి చర్యలు చేపట్టినట్లు టీఎన్ రఘునాథ్‌రెడ్డి కుమారుడు టీఎస్ హర్షవర్ధన్‌రెడ్డి శనివారం తెలిపారు. మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి రామాలయాన్ని పరిశీలించారు.

పారదర్శకంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ



మాట్లాడుతున్న సీడీపీఓ సి. రాజమ్మ

పీలేరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం పారదర్శకంగా అమలు చేయాలని సీడీపీఓ సి. రాజమ్మ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 88 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ (కిట్) పంపిణీ తరువాత తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో ఎటువంటి పరిస్థితుల్లోనూ నిల్వ ఉండరాదన్నారు. ఒకటి నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లల బరువు, ఎత్తు నమోదు చేయాలని ఆదేశించారు. పిల్లల ఎదుగుదలలో ఏవైనా సమస్యలుంటే సమీప సీహెచ్‌సీలో చూపించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వరూప, స్వర్ణ, ఉమా, అక్కయమ్మ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షకు పటిష్ట బందోబస్తు



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం నిర్వహించే పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక రాతపరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ పరీక్ష హాల్‌లోకి పోలీస్ సిబ్బంది వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. సీటీఎం రైల్వేస్టేషన్, మదనపల్లె ఆర్టీసీ బస్టాండు, చిత్తూరు బస్టాండు, బెంగళూరు బస్టాండు, నిమ్మనపల్లె క్రాస్‌వద్ద హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే తమ సిబ్బందిని అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, మురళీకృష్ణ, శివాంజనేయులు, సాదిక్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి


జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉమామహేశ్వరి

కలకడ : రైతులను వ్యవసాయ రంగంలో శాస్త్ర వేత్తలుగా తీర్చిదిద్ది అధిక దిగుబడి సాధించడానికి జిల్లాలో రైతుభరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉమామహేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని ముడియంవారిపల్లె రైతు భరోసా కేంద్రం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు సాగుచేసిన పంటలో అధిక దిగుబడిని సాధించడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో రైతుల అభివృద్ధి కోసమే ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. సాగు వివరాలు నమోదు, ఈకెవైసీ చేయడం వలన రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరడమే కాక, ఉచిత బీమా సౌకర్యం కూడా పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ గౌరి, సర్పంచ్ శాంతమ్మ, ఏఈఓ శ్రావన్, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

నిమ్మనపల్లె : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న సమగ్ర రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ సీ.ఆర్.మంజుల అన్నారు. శనివారం తవళం గ్రామంలో సమగ్ర రీసర్వేపై గ్రామసభను నిర్వహించారు. రీసర్వేపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. తవళం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకున్నామన్నారు. రీసర్వేలో భాగంగా గ్రామంలోని అన్ని రకాల భూములను ఆరు దశల్లో సర్వేతో పాటు నివేదికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ అధికారుల సూచనలతో భూసమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. శాశ్వత భూసమస్యలకు సమగ్ర రీసర్వే ఉపయోగపడుతుందని, రైతులు సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సిరాజుద్దీన్, ఆర్ఐ.రాంప్రసాద్, మండలసర్వేయర్ మురళీ, వీఆర్వో రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సుకన్య సంవృద్ధి యోజనలో మొదటి స్థానం



మాట్లాడుతున్న ఎస్ఎస్‌పీ మహమ్మద్ జాఫర్‌సాధిక్

పీలేరురూరల్ : రాష్ట్రంలో సుకన్య సంవృద్ధి యోజన పథకం నమోదులో తిరుపతి డివిజన్ మొదటి స్థానంలో ఉందని తపాలాశాఖ ఎస్ఎస్‌పీ మహమ్మద్ జాఫర్‌సాధిక్ అన్నారు. శనివారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో పీలేరు డివిజన్ తపాలా ఉద్యోగులకు సుకన్య సంవృద్ధి యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి తిరుపతి డివిజన్‌లో 11 వేల ఖాతాలు నమోదు చేసి మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. పొదుపు ఖాతాలు 60 వేలు నమోదు చేసి మూడో స్థానంలో ఉన్నట్లు చెప్పారు. తిరుపతి డివిజన్‌లో బ్రాంచ్‌పోస్టు ఆఫీసులు 398, సబ్‌పోస్టాఫీసులు 73, హెడ్ పోస్టాఫీసులు తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి ఉన్నాయని, పీలేరు కూడా కొత్తగా హెడ్‌పోస్టాఫీసుకు ఎంపికైందని తెలిపారు. తిరుపతి డివిజన్‌లో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు 40 ఖాళీలున్నాయని, అసిస్టెంట్ బ్రాంచ్‌పోస్ట్ మాస్టర్లు 70 ఖాళీలున్నాయని తెలిపారు. త్వరలో నోటిఫికేషన్ విడుదలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐపీపీబీ తిరుపతి మేనేజర్ సునీల్, పోస్టుమాస్టర్ వై. శేషాద్రి, పోస్టల్ ఇన్స్‌పెక్టర్ విజయభాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పీలేరు రూరల్ : రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 34వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆటో, ట్యాక్సీ, ప్రైవేట్ బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. డ్రైవింగ్‌కు వెళ్లే ముందు తమ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ నరసింహుడు, బిస్మిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు బోడేషావలి, నాయకులు రహమత్‌పీర్, వెంకటేష్, రమణ, గుణ, లవకుమార్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ క్యాలెండర్ ఆవిష్కరణ



జేవీవీ క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : జన విజ్ఞాన వేదిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన, సృజనాత్మకతను, సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచుతూ ప్రజలలో మూఢ నమ్మకాలను ప్రాలదోలడంలో జనవిజ్ఞాన వేదిక కృషి ప్రశంసనీయమన్నారు. జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు ఆనంద రెడ్డి, నల్లంకి నరసింహులు, కుమార్, మహేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వే పూర్తి చేయండి

కలకడ : ఆరోగ్య సమాచారంతో అందించే నివేదిక (ఎన్‌సీడీసీడీ) గుర్తింపు సర్వే పూర్తి చేయాలని డాక్టర్ జవహర్‌బాబు ఆదేశించారు. శనివారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షితమాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. హైరిస్క్ వాళ్లు వెంటనే రక్తం పెంచుకోవడానికి మంచి ఆహారం, మాత్రలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ జయరామయ్య పాల్గొన్నారు.

న్యాక్ గుర్తింపునకు సహకరించండి

మదనపల్లె : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడియేషన్ కౌన్సిల్ (నాక్) గుర్తింపుకు సంబంధించి నిర్వహిస్తున్న సర్వేకు బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లర్నర్ సపోర్ట్ సెంటర్ విద్యార్థులు సహకరించాలని కోఆర్డినేటర్ వెంకటశివారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2020–21 విద్యాసంవత్సరం నుంచి 2022–23 వరకు బీఏ, బీకాం, బీఎస్సీ చదువుతున్న ప్రతి విద్యార్థికి నాక్ కౌన్సిల్ నుంచి మెయిల్ వస్తుందన్నారు. విద్యార్థులు తమకు వచ్చిన మెయిల్‌ను ఓపెన్ చేస్తే గూగుల్ ఫారం వస్తుందన్నారు. అందులో ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన సర్వేపై 20 ప్రశ్నలు ఉంటాయన్నారు. వాటికి విద్యార్థులు సమాధానాలను నమోదుచేసి ఆన్‌లైన్‌లోనే సబ్మిట్ చేయాలన్నారు. సంతృప్తికర సమాధానాలు యూనివర్సిటీకి మంచి గ్రేడ్ వచ్చేలా సహకరించాలని కోరారు.

మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పద్మాంజలి

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పద్మాంజలిని నియమిస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లా డీసీహెచ్ఎస్ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆంజనేయులు అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో సీనియర్ డాక్టర్ రామమూర్తినాయక్‌కు బాధ్యతలు తీసుకోవాలని కోరగా, ఆయన వ్యక్తిగత కారణాలతో మినహాయింపు కోరడంతో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మాంజలిని నియమించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

గుర్రంకొండ : తల్లిదండ్రులు మైనర్ బాలబాలికలకు ద్విచక్రవాహనాలు ఇవ్వదని ఎస్ఐ దిలీప్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట నాకాబందీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలను నడుపుతున్న మైనర్ బాలురను అదుపులోకి తీసుకొని 20 ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. పిల్లల తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్రవాహాలను ఇవ్వడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పట్టురైతులకు అవగాహన సదస్సు

రామసముద్రం : మండలంలోని అరికెల పంచాయతీ గౌనివారిపల్లె గ్రామంలో పట్టుపరిశ్రమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ రాంమోహన్, సాంకేతిక సేవకేంద్ర అధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌కెవివై పథకం కింద పట్టు రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుపరిశ్రమ మిగతా పంటలతో పోలిస్తే ఎంతో లాభదాయకమన్నారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్‌లో వచ్చే లబ్ధి గురించి రైతులకు వివరించారు. అనంతరం మదనపల్లె సీఎస్‌బీ సైటిస్టు దీప మల్బరీ వంగడాలు, పట్టు పురుగుల పెంపకం, చీడల నివారణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమశాఖ సిబ్బంది రసూల్, నంజుండ, ఆంజనేయులు, పట్టు సహాయకులు సోమశేఖర్, కళావతి, రేవతి, ప్రీతం, అహమ్మద్‌బాషా పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

నిమ్మనపల్లె : పెరటికోళ్ల పెంపకంతో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎంపీడీఓ లీలామాధవి అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డితో కలిసి మహిళలకు పెరటి కోళ్లను, మందుల కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రాయితీ ధరలో ఒకో యూనిట్ రూ.3,200లకు 11 నాటుకోళ్లను ప్రభుత్వం ద్వారా మహిళలకు అందిస్తోందన్నారు. రోజువారి ఆదాయంతో పాటు అదనంగా పెరటికోళ్ల పెంపకంతో ఆదాయం ఆర్జించవచ్చని చెప్పారు. మండలానికి 100 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. వెలుగు సీసీ రెడ్డెప్ప, భారతి, శివారెడ్డి, నాయకులు శశిధర్‌రెడ్డి, గంగాధర పాల్గొన్నారు.

కురబలకోట : నాటు కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చని మండల వైస్ ఎంపీపీ భూదేవి, వెలుగు ఏపీఎం నీరజ తెలిపారు. శనివారం అంగళ్లులో వంద మంది డ్వాక్రా సభ్యులకు నాటు కోళ్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఒకప్పుడు పల్లెల్లో ఎక్కడ చూసినా నాటు కోళ్లు ఉండేవన్నారు. వీటికి ఇప్పుడు మంచి డిమాండు ఉందన్నారు. మూడు పుంజులు, ఎనిమిది పెట్టల యూనిట్ రూ. 3200 చొప్పున సభ్యులకు అందజేశామన్నారు. పెరటి కోళ్ల పెంపకంతో జీవనోపాధి పొందవచ్చన్నారు. ప్రభుత్వం ద్వారా మహిళలకు చేయూతను ఇచ్చేందుకు వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా నాటు కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందన్నారు.